క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



సామూహికంగా లక్ష బిల్వార్చన చేస్తున్న శివస్వాములు

ఆదోని అర్బన్: స్థానిక శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం శివమాలధారులు భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో భక్తులతో సామూహికంగా అష్టోత్తరం, బిల్వార్చన పూజలు జరిపించారు. బిల్వ పత్రాలతో శంభులింగేశ్వరస్వామికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి తొంటదార్య స్వామి ఉత్సవాలు



నదిచాగి గ్రామంలో వెలసిన తొంటదార్య స్వామి ఆలయం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన తొంటదార్య స్వామి మఠంలో 79వ జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని మఠం నిర్వాహకులు ఉత్తరాధికారి బసవలింగ మహాస్వామి బుధవారం తెలిపారు. ఉత్సవాలు పదిరోజుల పాటు జరుగుతాయని, ఈనెల 23న తొంటదార్య స్వామి మహారథోత్సవం జరుగుతుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు పురాణ ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు స్వామి తెలిపారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కౌతాళం: ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, మండల సీపీఐ కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కౌలు చేసుకున్న రైతులకు పంటలు నష్టపోతే ఎలాంటి పరిహారం అందడం లేదన్నారు. కనీసం కౌలు గుర్తింపు కార్డు కావాలన్న భూయాజమాని సంతకం ఉండాలని నిబంధనలు ఉండడం వల్ల కౌలు రైతులు గుర్తింపు కార్డులు కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకన్న, నరసయ్య, ఈరన్న, ఖాదర్‌లింగ, మహమ్మద్ పలువురు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ మనందరి బాధ్యత



మాట్లాడుతున్న అపార్డ్ సంస్థ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అఫిసీయా

ఎమ్మిగనూరురూరల్: అడవుల సంరక్షణ, అభివృద్ధి మనందరి బాధ్యత అని ఎంపీడీఓ బంగారమ్మ, సీడీసీఎల్ఆర్సీ కో-ఆర్డినేటర్ సుజాతమ్మ, అపార్డ్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అఫిసీయా అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో అడవుల సంరక్షణ, అభివృద్ధిపై అధికారులు, టీపీ, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడు తూ అడవులు అంతరించి పోతుండటంతో కాలుష్యం పెరిగి, కరువు కాటకాలు సంభవించే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో కొండలు, గుట్టలపై చెట్లు పెంచేందుకు రెవెన్యూ అధికారులు సహకరించాలని, కొండలు, గుట్టలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఏపీఓ విజయమోహన్, కమ్యూనిటీ ఆర్గనైజర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీ వద్ద నిర్మించిన టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి, ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా నాయకుడు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేసీ జబ్బార్, దాదావలి, తిమ్మగురుడు, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

☛ దేవనకొండ గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు పొగాకు క్వింటా రూ.15వేలకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో మూడెకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడులను విక్రయానికి తీసుకొస్తే సదరు కంపెనీవారు క్వింటాకు రూ.9వేలు ధర నిర్ణయించారు. దీంతో వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంత తక్కువ ధర వేస్తారా, మీకు ఇవ్వను, ఇక్కడే పెట్రోల్ పోసి కాల్చి వెళ్లిపోతానని పెట్రోలు తీసుకురాగా.. గోదాము, కంపెనీ ప్రతినిధులు అడ్డుకున్నారు.



☛ పత్తికొండ మండలం పుచ్చలకాడ గ్రామానికి చెందిన మల్లికార్జున ఆరు ఎకరాల్లో పొగాకు సాగు చేయగా ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనికి కూడా కంపెనీవారు రూ.9వేలు ధర వేశారు. మరికొంత మంది రైతుల దిగుబడులు బాగా లేవని దీనిని వెనక్కి తీసుకునిపోమ్మని చెప్పారు. రాత్రనక పగలనకా కష్టపడి పండిస్తే గ్రేడింగ్ అంటూ ధరను తక్కువ చేసి, మిగిలిన దిగుబడులు సరిగా లేవు, వెనక్కి తీసుకుపో అంటే తాము ఎక్కడికి తీసుకెళ్లాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట వేయక ముందే చెప్పివుంటే వేరే పంట వేసేవాళ్లమని, పొగాకు సాగుచేసి చాలా నష్టపోయామని వాపోయారు.



నమ్మించి నట్టేట ముంచారు!

- పొగాకు రైతులను మోసం చేసిన ప్రైవేటు పొగాకు కంపెనీ
- పొగాకు సాగుచేయండి దిగుబడులు ఎలాగున్నా క్వింటా రూ.15 వేలకు కొంటామని హామీ
- పంట విక్రయానికి తీసుకొస్తే గ్రేడింగ్ ప్రకారం ధర నిర్ణయం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు





పొగాకు దిగుబడి సరిగా లేదని కంపెనీ ఉద్యోగులు చెప్పడంతో ట్రాక్టర్‌లో వేసుకుని వెళ్తున్న దృశ్యం, రైతులు అమ్మకానికి తెచ్చిన పొగాకు బేళ్లు

ఆదోని అర్బన్: పొగాకు రైతులను ఓ ప్రైవేటు కంపెనీ నట్టేట ముంచింది. పొగాకు సాగు చేయండి దిగుబడి ఎలావున్నా క్వింటా రూ.15 వేలకు కొనుగోలు చేస్తామని రైతులను నమ్మించి.. తీరా దిగుబడులు అమ్మకానికి తీసుకెళ్తే కంపెనీ అధికారులు మాటమార్చి గ్రేడింగ్ ప్రకారంగా ధర వేస్తామంటూ రైతులను మోసం చేశారు.

నారు రూ.4,500లకు విక్రయం

పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ మండలాల పరిధిలోని గ్రామాల్లో గుంటూరుకు చెందిన గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ పొగాకు కంపెనీ ఉద్యోగులు రైతుల వద్దకు వెళ్లి పొగాకు పంట వేయండి, దిగుబడి ఎలా ఉన్నా క్వింటం ధర రూ.15 వేలు ధరను వేస్తాం అని రైతులను నమ్మించారు. ఎకరాకు పొగాకు నార రూ.4,500లకు కంపెనీ వారే విక్రయించారు, ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. దీంతో రైతులు ఎకరాకు రూ.లక్ష ఖర్చు పెట్టి పొగాకు సాగుచేశారు. రాత్రి అనకా, పగలనకా కష్టపడి పంటను కాపాడుకున్నారు. తీరా దిగుబడి చూస్తే 5 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది.

రూ.7 వేల నుంచి కొనుగోళ్లు..

మండలంలోని ధణాపురం గ్రామంలో ఉన్న గణేష్ రూరల్ గోడౌన్‌లో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆ కంపెనీతో ఒప్పందం చేసుకొని పండించిన రైతులకు దిగుబడులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కాగా, బుధవారం పత్తికొండ, ఆస్పరి మండలాల నుంచి 20 మందికి పైగా రైతులు పొగాకు విక్రయానికి తెచ్చారు. అయితే కంపెనీ ఉద్యోగులు గ్రేడింగ్ చేసి రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు ధరను నిర్ణయించారు. దీంతో రైతులు ఒక్కసారిగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కంపెనీ ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. పంట వేసే ముందు ఎలా వున్నా కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఇలా మాట్లాడుతారేమని నిలదీశారు. దీంతో ఇస్తే ఇవ్వండి, లేకుంటే ఎక్కడైనా అమ్ముకోండి మేము తీసుకోమని తెగేసి చెబుతున్నారు.

గ్రేడింగ్ చేసి ధరను నిర్ణయిస్తామని చెప్పాం..

ధర విషయంపై గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఉద్యోగి కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గ్రామాల్లోకి వెళ్లి పొగాకు దిగుబడులకు గ్రేడింగ్ చేసి ధరను నిర్ణయిస్తామని చెప్పాం. రూ.7 వేల నుంచి రూ.15,500 వరకు ధర వేస్తున్నాం. కంపెనీ నిబంధనలు సమావేశంలో ప్రతి రైతుకు చెప్పాం. దిగుబడి సరిగా లేకుంటే ఎలా కొనుగోలు చేస్తాం.

శ్రీ మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక వ్రతంలో భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాఘవేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం వైభవంగా జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీమఠం పూజా మందిరంలో వ్రతాన్ని చేపట్టారు. వేలాది మంది భక్తులు వ్రతంలో పాల్గొని అర్చనలు చేసుకున్నారు. సత్యనారాయణ స్వామి నామస్మరణ చేస్తూ శాస్త్రోక్తంగా వ్రతం పాటించారు.

స్వామివారి సన్నిధిలో ఎస్పీ ..



మఠం ప్రాంగణంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈయనకు మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్ఐ శివాంజల్, ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజ్ ఉన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత గోనెగండ్ల జట్టు



విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న గోనెగండ్ల జట్టు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో లాలుస్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర హోంటీం కబడ్డీ టోర్నీలో గోనెగంట్ల జట్టు విజేతగా నిలిచింది. రెండ్రోజుల పాటు జరిగిన టోర్నీ బుధవారం నాటి ఫైనల్ పోటీలో తాడిపత్రి జట్టుతో తలబడిన గోనెగండ్ల జట్టు మెరుగైన ఆటతీరుతో ప్రథమ బహుమతి రూ.20వేలు గెలుచుకుంది. తర్వాతి 5 స్థానాల్లో వరుసగా తాడిపత్రి, డోన్ మండలం వి.బొంతిరాళ్ల, కోడుమూరు మండలం వల్కూరు, దేవనకొండ మండలం గుడిమర్రాళ్ల, గుండ్లకొండ జట్లు నిలిచి రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు గెలుచుకున్నాయి. విజేతలకు దాతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులందించారు.

రేణుకా ఎల్లమ్మకు విశేష పూజలు



అమ్మవారి సన్నిధిలో సుందర రాజు దంపతులు

కోసిగి: మండలకేంద్రంలో వెలసిన రేణుకా ఎల్లమ్మ దేవికి పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. బుధవారం అమ్మవారి ఆలయంలో అర్చకులు మూర్తి గౌడ్ ఆధ్వర్యంలో కుంకుమార్చన, మహామంగళహారతులు గావించి విశేష పూజలు చేపట్టారు. అమ్మవారి ఆలయ గర్భగుడి ముఖద్వారానికి బంగారు పూత పూసిన ఇత్తడి కవచాన్ని దొరల వంశస్తులు సుందరరాజు దొర బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

విలీన సభను జయప్రదం చేద్దాం

ఆదోని సెంట్రల్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అనుబంధ సంస్థల విలీన సభను జయప్రదం చేద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, సహాయ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆ సంఘం నాయకులు విద్యార్థుల సమక్షంలో విలీన సభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, కాషాయికరణ చేసేందుకు ముమ్మరం చేసిందన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా యూజీసీని సవరిస్తూ రాష్ట్రాల ఫెడరల్ హక్కులను దెబ్బతీసే విధంగా చర్యలు తీసుకుందని విమర్శించారు. చిన్న చిన్న సమస్యలతో పీడీఎస్‌యూ నుంచి విడిపోయిన పలు సంస్థలు విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 14వ తేదీన నెల్లూరు నగరంలో ఏకం కాబోతున్నాయని తెలిపారు. అందుకే వీలన సభలకు సంఘీ భావం తెలిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకురాళ్లు శిరీష, వర్షిని, అఖిల, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: నెల్లూరులో ఈనెల 14వ తేదీన నిర్వహించే ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విలీన సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు నరసింహా రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రెండుగా చీలిన సంఘాలు ప్రస్తుతం విలీనం కాబోతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కిరణ్, రాకేష్, అబ్దుల్, కార్తీక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ సబ్‌స్టేషన్ తనిఖీ



సబ్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్ శ్రీరామ్‌సింగ్, ఎస్ఈ ఉమాపతి, విద్యుత్‌శాఖ అధికారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఏపీఈఆర్‌సీ చైర్మన్ శ్రీరామ్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ మొత్తం కలియతిరిగి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ఎండాకాలంలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ ఉమాపతి, ఆదోని డీఈ హరి, అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోమ్‌పై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో కనీస వసతులు లేకపోయినా రోగులను దోపిడి చేస్తున్న రేఖ నర్సింగ్ హోంపై చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మహేంద్రబాబు, ఉదయ్, శేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో బుధవారం పాతకక్షలతో గొడవకు దిగిన రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన బసప్ప, మరో నలుగురు ట్రాక్టర్ వేగంగా నడిపిన విషయంలో మరో వర్గానికి చెందిన దర్గప్ప మరో నలుగురు గొడవకు దిగి దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గంగాధర్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పగలు సమయంలో ఎవరైనా వ్యాపారం పేరుతో ఊళ్లలోకి కొత్త వ్యక్తులు వచ్చి అనుమానంగా తిరిగుతున్నట్లు అనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వలసలు వెళ్లే కూలీలు విలువైన వస్తువులు డబ్బులు, బంగారు ఇళ్లలో పెట్టుకోకూడదన్నారు. ధాన్యము, ఇంకా ఏవైనా వస్తువులు ఉన్నట్లయితే ఒకరిని ఇంటి దగ్గరే ఉంచివెళ్లడం మంచిదని చెప్పారు.

కేసు నమోదు

ఆదోని అర్బన్: బసాపురం గ్రామానికి చెందిన రఘునాథ్, ఆడివేష్‌లపై బెదిరింపు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ శ్రీరాం బుధవారం తెలిపారు. పట్టణంలో మధు ప్రైవేట్ ఆసుపత్రిలో అక్రమాలు జరిగాయని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, రూ.50 లక్షలు ఇస్తే బయటపెట్టమని ఆసుపత్రి నిర్వాహకుడు గుర్రెడ్డిని బెదిరించారన్నారు. గుర్రెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ కోరారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోనెగండ్లలో హాస్టల్ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వలసలు వెళ్తున్నప్పుడు విద్యార్థులను కూడా వలసలకు తీసుకెళ్తున్నారన్నారు. దీంతో చదువుకునే విద్యార్థులు చదువు దూరం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రంగస్వామి, కార్యదర్శిగా పవన్ తేజ మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, వినయ్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న ఆదోని పట్టణంలోని పద్మావతి జూనియర్ ఒకేషనల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు తిరుమలేష్‌నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కళాశాలను సందర్శించి, విద్యార్థులని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఫీజులు కట్టాలని ప్రతిరోజూ ఒత్తిడి చేస్తోందన్నారు. కొద్ది రోజులు సమయం ఇవ్వాలని అడిగినా వినిపించుకోవడం లేదన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆదోని టౌన్: పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు, పీఎన్ రోడ్డు, గోస్ ఆసుపత్రి రోడ్డు, విక్టోరియాపేట, టీజీఎల్ కాలనీ, పాత బస్టాండు సర్కిల్‌లోని అన్న క్యాంటీన్, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పర్యటించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక తీత పనులను పరిశీలించారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

కోసిగి: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఈనెల 14న ఎమ్మిగనూరుకు చెందిన ఆర్‌కే కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ హాస్పిటల్ డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. కంటి పొర, శుక్లము, వివిధ రకాల కంటి పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. కంటి పరీక్షలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జేసీకి వినతుల వెల్లువ



వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని జేసీ నవ్యకు వినతి అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ప్రజాసంఘాల నుంచి వినతులు వెల్లువలా వచ్చాయి. బుధవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించిన అనంతరం జేసీ బి.నవ్య స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ వచ్చినట్లు తెలుసుకున్న పలు ప్రజాసంఘాల నాయకులు సమావేశం అనంతరం ఆమెను కలిసి వినతులు అందజేశారు. వార్డు, గ్రామీణ వలంటీర్లను విధుల్లోకి తీసుకొని ఉపాధి కల్పించి ఆదుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాముడు, తిమ్మన్న, గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు సురేష్, వలంటీర్ల యూనియన్ అధ్యక్షురాలు శిరిష కోరారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పారని, మాట నిలబెట్టుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

➡ గ్రామాల్లో భూ రీ సర్వేలో అవకతవకలు ఉన్నాయని అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాలరాజు, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి బాబు, ప్రగతిశీల సంఘం నాయులు మునెప్ప,రైతు సంఘం నాయకులు నాగేంద్ర, రాఘవేంద్ర, గౌసేలు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. రీ సర్వేలో రికార్డులు సక్రమంగా ఉన్నా మిగులు భూములుగా నమోదు అవుతున్నాయని వాటిని తొలగించి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో వలసలు నివారించి ఉపాధి పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

➡ కలుగోట్ల గ్రామ సర్వేయర్ విజయప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని జావీద్ ఫిర్యాదు చేశారు. భూములు సర్వే చేసేందుకు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, డబ్బులు తీసుకొని భూ సరిహద్దు, చెక్ బందీలు మారుస్తూ రైతుల మధ్యగొడవలు పెడుతున్నాడని తెలిపారు. సర్వేయర్‌పై చర్యలైన తీసుకోవాలని,లేనిపక్షంలో వేరేచోటుకు బదిలీ చేయాలని కోరారు.

➡ మంత్రాలయం మండలం చిలకలడోణ, బూదూరు ఏఈ మల్లయ్య, కాంట్రాక్టర్ రఘులపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు గండుపోగుల నేపాల్ ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్డు సగం వరకు వేసి వదిలి వేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ప్రశ్నిస్తే ఏఈ, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని చెప్పారు.

➡ ఎస్సీ కులగణన నుంచి మాదాసి కురవలను తొలగించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల ఉపాధ్యక్షులు సుమాల అంథోని, సుమాల రాజు, గుండప్పలు వినతి పత్రం అందజేశారు.

➡ నందవరం మండలంలో ఇష్టానుసారంగా ఆటోలు, వ్యాన్లలో విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిద్, ఆర్యూ ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ ఫిర్యాదు చేశారు.

ముగిసిన సిద్ధరూఢ స్వామి ఉత్సవాలు



కలశాలతో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని రైల్వే గేటు సమీపంలో కొలువైన శ్రీ సిద్ధరూఢ స్వామి ఆలయ నవమ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. బుధవారం మాఘ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని వేకువ జామున నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పుణ్యాఃవాచకము, బిల్వా అర్చనలు, మహామంగళ హారుతుల గావించి విశేష పూజలు చేపట్టారు. కర్నాటక రాష్ట్రం షణ్ముఖరూఢ మఠం పీఠాధిపతి అభినవ సిద్ధరూఢ మహా స్వామి, ఉరుకుండ గవి మఠం పీఠాధిపతి కరిబసరాజేంద్ర స్వామి, గూళ్యపాళెం ప్రణవానంద గిరి స్వామి, స్వరూపనందగిరి స్వామి, శివానంద స్వామి, గురుసేవానంద స్వామిలు హాజరై మూడు రోజుల పాటు భక్తులకు సిద్ధరూఢస్వామి జీవిత చరిత్ర ఉపన్యసించారు. ప్రతి ఒక్క భక్తి మార్గంలో నడుచుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. పీఠాధిపతిలను ఆలయ కమిటీ ఆధ్వర్యం సన్మానించారు. సాయంత్రం సిద్ధరూఢ స్వామి ఉత్సవ మూర్తిని రథంపై కొలువుంచి మేళతాళాలు, కలశాలు , డప్పువాయిద్యాలతో ఆలయం చెంత నుంచి రైల్వే గేటు వరకు ఊరేగింపు నిర్వహించారు.

షబ్-ఏ-బరాత్ ఏర్పాట్ల పరిశీలన



ముస్లిం శ్మశానవాటికలో లైటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: షబ్-ఏ-బరాత్‌ను పురస్కరించుకొని స్థానిక ముస్లిం ఖబరస్థాన్ (శ్మశానవాటిక)లో ఏర్పాట్లను బుధవారం స్థానిక కౌన్సిలర్, జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఖాశింబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రియాజ అహమ్మద్‌లతో ముస్లిం పెద్దలు పరిశీలించారు. షబ్-ఏ-బరాత్ (బడీరాత్) సందర్భంగా గురువారం రాత్రి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకొన్న అనంతరం ఖబరస్థాన్ వెళ్లి తమ పెద్దలకు దువా చేసుకుంటారు. కావున అక్కడ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఇప్పటికే ఖబరస్థాన్‌లో శాశ్వత లైటింగ్‌కై రూ.2లక్షల ప్రతిపాదనకు పాలకవర్గం ఆమోదించిందని వారు తెలిపారు. పారిశుద్ధ్య పనులతో పాటు లైటింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడంతో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట మున్సిపల్ మాజీ కోఆప్షన్‌మెంబర్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



మాట్లాడుతున్న ఏడీఏ బాలవర్ధిరాజు

ఆదోని రూరల్: భూమి కలిగిన రైతుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ)ని అందిస్తుందని ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెసలబండ, కపటి గ్రామాల్లోని గ్రామ రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతులు 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్డును కలిగిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకం లేదా వన్‌బీ, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసు కుని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.